# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, గురువారం 15 ఆగస్టు 2024 | HYDERABAD




## శ్రమజీవి..

బుధవారం ముషీరాబాద్ చౌరస్తా నుంచి కవాడిగూడ వెళ్లే ప్రధాన రహదారిలో డ్రైనేజీ నిండిపోయింది. నీరు వెళ్లే మార్గం లేక రోడ్డుపైనే నిలిచాయి. దీంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. రహదారిపై నిలిచిన నీటిని తొలగించేందుకు ఇలా మ్యాన్‌హోల్‌లోకి దిగి మట్టిని తీస్తున్న ఓ కార్మికుడు.




గర్ల్స్ హాస్టల్‌ను యూజీ విద్యార్థినులకే కేటాయించాలంటూ నిజాం కళాశాలలో చేపట్టిన నిరసన 8వ రోజుకు చేరుకున్నది. బుధవారం ప్లకార్డులు ప్రదర్శిస్తూ విద్యార్థులు ఇలా ఆందోళన చేశారు. -సుల్తాన్‌బజార్








## ఉక్కపోత.. వాన



సిటీబ్యూరో: గ్రేటర్‌లో భిన్న వాతావరణం నెలకొంది. పలు చోట్ల ఉక్కపోతతో చెమటలు పట్టిస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు వాన కురుస్తున్నది. బుధవారం అత్యధికంగా హైదర్‌నగర్‌లో 3.65, శంషిగూడలో 2.68, మహదేవ్‌పురం, బాలాజీనగర్‌లో 2.25, కేపీహెచ్‌బీ, జీడిమెట్ల, షేక్‌పేట, ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లో 1.75 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రెండు రోజులు పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు తెలిపారు.

## గడ్డం గీసే కత్తితో

# గొంతు కోసి..

### నార్సింగిలో వ్యక్తి దారుణ హత్య

మణికొండ, ఆగస్టు 14: పాత కక్షలతో ఓ వ్యక్తిని గడ్డం గీసే కత్తితో హత్య చేసిన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ హరికృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగి కుమ్మరి బస్తీకి చెందిన కొండ రాజు(48) స్థానికంగా కట్టింగ్ షాప్ నిర్వహిస్తున్నాడు. అతడికి భార్య వరలక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సమీప ప్రాంతంలో ఉండే బంధువు ప్రవీణ్‌కుమార్‌తో రాజుకు కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. గతేడాది డిసెంబర్ 31న తమ ఇంటి ఎదుట ముగ్గులు వేసుకున్న క్రమంలో వాటిని చెరిపేశాడని రాజు ప్రవీణ్‌తో ఘర్షణపడ్డాడు. అప్పట్లో ఈ గొడవ నార్సింగి పోలీస్‌స్టేషన్ వరకూ వెళ్లి.. పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. పెద్దలు జోక్యం చేసుకొని సర్దిచెప్పడంతో కేసును వాపసు తీసుకున్నారు. ఈ విషయంలో రాజుపై కక్ష పెంచుకున్న ప్రవీణ్.. అతడిని ఎలాగైనా హతమార్చాలని నిర్ణయించుకొన్నాడు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఇంట్లోకి చొరబడి రాజును గడ్డం గీసే కత్తితో గొంతు కోసి అతి దారుణంగా హత్య చేశాడు. ఉదయం నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


## బదిలీ చేసినా..

# బల్దియాలోనే

### వదల బొమ్మాళీ.. వదలా..

### ప్రజాప్రతినిధుల సిఫారసులతో కమిషనర్‌పై డీసీల ఒత్తిళ్లు

సిటీబ్యూరో: బదిలీ అయినా..బల్దియాలోనే ఉంటామంటున్నారు కొందరు అధికారులు. ఒక్కసారి బల్దియాలో పోస్టింగ్‌లోకి వస్తే చాలు.. తిరిగి బదిలీపై వెళ్లేందుకు చాలా మంది ఇష్టపడటం లేదు. రెగ్యులర్ ఉద్యోగులే కాదు.. రిటైర్డ్ ఉద్యోగులు సైతం పైరవీలతో తిరిగి తమ స్థానాన్ని పదిలం చేసుకోవడం పరిపాటిగా మారింది. అలా పదవీ విరమణ చేసి ఎక్స్‌టెన్షన్‌పై నేటికీ కొనసాగుతున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా పురపాలక శాఖ పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా బదిలీలు జరిగాయి. మున్సిపల్ జాయింట్ డైరెక్టర్లు, అదనపు కమిషనర్లు, జాయింట్ కమిషనర్లతో పాటు గ్రేడ్ 1, 2, 3లకు చెందిన 24 మందికి స్థానచలనం కల్పిస్తూ పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ గత నెల 31న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రక్రియలో భాగంగా జీహెచ్‌ఎంసీలోని 12 మందికి కూడా స్థానచలనం కలిగింది. వీరిలో ఇద్దరు మహిళా జాయింట్ కమిషనర్లు మెడికల్ నిబంధనలు పెట్టి.. ట్రాన్స్‌ఫర్ అయిన చోట రిపోర్టు చేయకుండా బల్దియాలోనే కొనసాగుతున్నారు. అంతేకాకుండా జూబ్లీహిల్స్, యూసీడీ విభాగం, ప్రధాన కార్యాలయంలో జాయింట్ కమిషనర్ ఒకరు పైరవీలతో మళ్లీ జీహెచ్‌ఎంసీలోనే కొనసాగేలా పావులు కదుపుతున్నారు. ఇందులో భాగంగానే ప్రజాప్రతినిధుల సిఫారసులతో కమిషనర్ ఆమ్రపాలిపై ఒత్తిడి పెంచుతున్నారు. కమిషనర్ సైతం ప్రభుత్వ స్థాయిలో జరిగిన బదిలీలపై తాను నిర్ణయం తీసుకోలేనని, ఏదైనా ఉంటే ప్రభుత్వంతో మాట్లాడుకోవాలని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ అడ్డదారిలో కొనసాగేందుకు డిప్యూటీ కమిషనర్లు సన్నాహాలు చేస్తున్నారు. కాగా, బదిలీపై జీహెచ్‌ఎంసీకి వచ్చిన వారికి సైతం నేటికీ పోస్టులు ఇవ్వలేదు. పోస్టింగ్‌పై స్పష్టత లేకపోవడంతో వారంతా 13 రోజులుగా ఆఫీసుకు రావడం, తిరిగి ఇంటికి వెళ్లడం చేస్తున్నారు.







## బెంగాల్ ఘటనపై జూడాల నిరసన

సిటీబ్యూరో, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటనను నిరసిస్తూ.. నగరంలోని మెడికల్ కళాశాలల వైద్య విద్యార్థులు బుధవారం ధర్నాకు దిగారు. ఓపీ సేవలను బహిష్కరించారు. దీంతో ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, కోఠి ఈఎన్‌టీ, సుల్తాన్‌బజార్, పేట్లబుర్జ్ ప్రసూతి దవాఖానలు, నల్లకుంట ఫీవర్ హాస్పిటల్, ఎర్రగడ్డ చాతీ దవాఖాన తదితర అన్ని ప్రభుత్వ టీచింగ్ హాస్పిటల్స్‌లో ఓపీ సేవలకు ఆటంకం తప్పలేదు. ఓపీ సేవల బహిష్కరణపై జూడాలు ముందస్తు సమాచారం ఇచ్చినప్పటికీ అధికారులు సరైన ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు ఇబ్బంది పడాల్సి వచ్చింది.



నాగోల్ మెట్రో స్టేషన్‌లో ఆందోళన చేస్తున్న మెట్రో ప్రయాణికులు

## ఇష్టారాజ్యంగా

# పెంచుతారా?

### పెయిడ్ పార్కింగ్‌పై భగ్గుమన్న మెట్రో ప్రయాణికులు

*'మేము చేస్తున్న ఆందోళన సీఎం రేవంత్‌రెడ్డి దాకా పోవాలే.. మా సమస్యకు పరిష్కారం కావాలే... పార్కింగ్ చార్జీలను ఇష్టారాజ్యంగా పెంచుతారా? ఇది ప్రభుత్వ స్థలం.. అందులో పార్కింగ్ ఫీజులు వసూలు చేయడం దారుణమైన నిర్ణయం.. ఎల్‌అండ్‌టీ డౌన్...డౌన్.. వీ వాంట్ జస్టిస్... అంటూ ' నాగోల్ మెట్రో స్టేషన్‌లో ప్రయాణికులంతా బుధవారం ఉదయం ఒక్కసారిగా ఆందోళనకు దిగారు. ఇప్పటికే మెట్రో చార్జీలు ఎక్కువగా ఉన్నాయంటూ.. పెయిడ్ పార్కింగ్ నిర్ణయాన్ని తప్పపట్టారు.*

*-సిటీబ్యూరో, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ)*

**ఉప్పల్ మెట్రో** డిపో పక్కన ఇప్పటి వరకు ఉచిత పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించిన ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు.. ఒక్కసారిగా పెయిడ్ పార్కింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. దీంతో నాగోల్ స్టేషన్‌లో వందలాంది మంది ప్రయాణికులు పెద్ద ఎత్తున నినాదాలతో ఆందోళనకు దిగారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ లేకపోవడం వల్ల ఇంటి నుంచి మెట్రో స్టేషన్ వరకు తమ సొంత వాహనాల్లోనే వస్తున్నారు. ఈ కారణంగానే టర్మినల్ స్టేషన్లు అయిన నాగోల్, మియాపూర్, ఎల్బీనగర్, రాయదుర్గం, పరేడ్ గ్రౌండ్ వంటి ప్రాంతాల్లో వేలాది వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో పెయిడ్ పార్కింగ్ విధానాన్ని తీసుకురావడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు.

### ఆగస్టు 25 నుంచి ..

హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టులోని నాగోల్,మియాపూర్ మెట్రో డిపో ప్రాంతాల్లో ఉన్న పార్కింగ్ స్థలాల్లో పెయిడ్ పార్కింగ్ విధానాన్ని అమలు చేస్తున్నామని ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 25 నుంచి నాగోల్ పార్కింగ్ లాట్‌లో, అదేవిధంగా సెప్టెంబర్ 1 నుంచి మియాపూర్ మెట్రో పార్కింగ్ లాట్‌లో పెయిడ్ పార్కింగ్ సేవలను అమలు చేస్తామని వెల్లడించారు.

### ఆఫీసుకు వెళ్లొస్తే..9 గంటలు..

మెట్రో స్టేషన్‌లో కారు పెట్టి ఐటీ కారిడార్‌లోని ఆఫీసుకు వెళ్లి తిరిగి వచ్చే సరికి 9 గంటలకు పైగా సమయం పడుతుంది. దీంతో కారు పార్కింగ్ 8 గంటలు దాటింది.. కాబట్టి ఫీజు రూ.120.00లు చెల్లించాలి. అదే సమయంలో మెట్రో రైలులో ప్రయాణం చేసినందుకు మరో రూ. 50–60ల దాకా ఖర్చవుతుంది. అక్కడి నుంచి ర్యాపిడో వాహనంలో ఆఫీసు వరకు వెళితే రూ.30–40లు అవుతాయి. ఇలా కారులో వచ్చే మెట్రో ప్రయాణికుడి ఖర్చు రూ.200లు అవుతుంది. ఇంత భారాన్ని మేము మోసేదెలా అంటూ మెట్రో అధికారులతో ఓ ప్రయాణికుడు వాగ్వాదానికి దిగాడు.




### బాధ్యత మాది కాదు...

పార్కింగ్ లాట్‌లో చాలా మౌలిక వసతులు కల్పిస్తున్నామని మెట్రో అధికారులు పేర్కొంటున్నారు. అయితే వాహనాలు దొంగతనానికి గురైనా, పాడైనా, డ్యామేజ్ అయినా, వాహనాల విడి భాగాలు దెబ్బతిన్నా.. మాది బాధ్యత కాదంటూ.. బోర్డు ఏర్పాటు చేయడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు.

# భూ తగాదాలే..

### హత్య కేసు ఛేదించిన బాలాపూర్ పోలీసులు

మన్సూరాబాద్, ఆగస్టు 14 : బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 9న జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. భూ తగాదాలే హత్యకు కారణమని తేల్చారు. ఎనిమిది నిందితులను అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు వెల్లడించారు. ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం సీపీ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. మీర్‌పేట్, షరీఫ్‌నగర్, వాది ఈ సనత్‌లో వ్యాపారి షేక్ మహ్మద్ హమీద్ నివసిస్తున్నాడు. అతడి ఇంటి పక్కనే పాతనేరస్తుడు ఖాజా రియాజుద్దీన్ (40) ఉంటున్నాడు. మేలో వాదిఈ సనత్‌లోని ఓ స్థలంలో షేక్ మహ్మద్ హమీద్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేశాడు. ఆ స్థలం తనదంటూ ఖాజా రియాజుద్దీన్ మహ్మద్ హమీద్‌తో గొడవపడ్డాడు. వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్న స్థలం తనదంటూ ఖాజా రియాజుద్దీన్ తరచూ గొడవలు పెట్టుకుంటుండంతో అతడిపై మహ్మద్ హమీద్ కక్ష పెంచుకున్నాడు. ఖాజా రియాజుద్దీన్‌ను అంతమొందిస్తేనే..స్థలం దక్కుతుందని భావించిన మహ్మద్ హమీద్ పథకం వేసుకున్నాడు. పాతనేరస్తుడైన మహ్మద్ సలీంను కలిశాడు. ఖాజా రియాజుద్దీన్‌ను చంపితే 13 లక్షలు ఇస్తానని సలీంతో ఒప్పందం చేసుకొని.. ముందుగా రూ. 2.50లక్షలు అడ్వాన్సుగా ఇచ్చాడు. హత్యలో సహకరిస్తే పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లిస్తానని..మహ్మద్ సలీం మహ్మద్ సుల్తాన్, మహ్మద్ గౌస్, మహ్మద్ ఇస్మాయిల్, అహ్మద్ అలియాస్ బాద్‌షా, సయ్యద్ ఇనాయత్ ఉల్లా, తాఫిక్‌ఖాన్, షేక్ హుస్సేన్‌కు చెప్పాడు. మహ్మద్ హమీద్, మహ్మద్ సలీం యూపీకి వెళ్లి.. ఫజిల్, ఫరాజ్ అనే వ్యక్తుల వద్ద కంట్రీమేడ్ పిస్టల్, బుల్లెట్లను కొనుగోలు చేశారు.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

### బైక్‌ను ఢీకొట్టి..

ఖాజా రియాజుద్దీన్ కంచన్‌బాగ్‌లోని ఓ బార్‌లో ఈ నెల 9న మద్యం సేవించి రాత్రి ఇంటికి బయలు దేరాడు. సలీం, సుల్తాన్, గౌస్, ఇస్మాయిల్ కారులో బైకుపై వెళ్తున్న ఖాజా రియాజుద్దీన్‌ను వెంబడించి..కారుతో బైకును ఢీకొట్టారు. ఖాజా రియాజుద్దీన్‌పై మహ్మద్ సలీం పిస్టల్‌తో కాల్పులు జరపగా, మిగతా వారు ఆయుధాలతో దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఎనిమిది మంది నిందితులను పట్టుకోగా, మిగతా వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## త్రివర్ణ శోభితం..

స్వాతంత్ర్య దినోత్సవానికి భాగ్యనగరం మూడు రంగులతో ముస్తాబైంది. బుధవారం రాత్రి త్రివర్ణశోభిత విద్యుత్ దీపాలతో సచివాలయం ఇలా ప్రకాశవంతంగా వెలిగిపోయింది.

